HICON SERIES

CLASS 5 TERM-1

# తెలుగు భారతి

LESSON 5







CLICK HERE TO ACTIVATE

LESSON
PART 2

# 5. గొప్ప ధర్మాత్ముడు

ఓ రాజుకు నలుగురు కొడుకులుండేవారు. "ఎవరైతే సర్వాధికుడైన ధర్మాత్ముణ్ణి వెతికి తీసుకొని వస్తాడో అతడికే రాజ్యాధికారం ఇవ్వబడుతుంది" అని రాజు నలుగురు కుమారులతో అన్నాడు. అందుకు సరేనని, రాకుమారులు నలుగురూ గుఱ్ఱాలెక్కి నాలుగు దిశలకు బయలుదేరారు.



కొన్నాళ్ళు గడిచాయి. పెద్దకొడుకు తిరిగివచ్చి తండ్రికి ఎదురుగా ఒక వ్యాపారిని నిలబెట్టి "ప్రభూ! ఈ వ్యాపారి సర్వదా వేలాది రూపాయలు దానం చేస్తుంటారు. వీరు ఎన్నో ఆలయాలు కట్టించారు. చెరువులు త్రవ్వించారు. తీర్థక్షేత్రాలలో వీరు ఎన్నో వ్రతాలు చేస్తుంటారు. గోపూజలు చేస్తుంటారు. ప్రపంచంలో వీరిని మించిన గొప్ప ధర్మాత్ముడెవడు ఉండడు" అన్నాడు.

"ఈయన నిశ్చయంగా ధర్మాత్ముడే" అని రాజు పలికి ఆ వ్యాపారిని సత్కరించి పంపివేశాడు. తర్వాత రెండవకొడుకు ఓ బక్కచిక్కిన బ్రాహ్మణుణ్ణి తీసుకువచ్చి "ప్రభూ! ఈ బ్రాహ్మణోత్తముడు అన్ని తీర్థయాత్రలు కాలినడకన చేశాడు. సదా వీరు చాంద్రాయణ వ్రతం చేస్తూంటారు. సత్యవాది. శాంత స్వభావి. నియమబద్ధంగా మంత్రజపాదులు పూర్తి చేసుకొన్న తర్వాతనే జలపానం చేస్తారు. త్రికాలాల్లోనూ స్నానం చేసి సంధ్యావందనం చేస్తారు. ఈ కాలంలో ఈ విశ్వంలో వీరిని మించి సర్వశ్రేష్ఠ ధర్మాత్ములెవరూ మరిలేరు" అన్నాడు.

రాజు ఆ బ్రాహ్మణోత్తమునికి నమస్కరించి అధిక దక్షిణలిచ్చి "వీరూ మంచి ధర్మాత్ములే" అంటూ పంపివేశాడు.

తర్వాత మూడవ కొడుకు మరలి వచ్చాడు. అతనితో కూడా ఓ సాధువు ఉన్నాడు. ఆ సాధువు వస్తూనే ఆసనం వేసుకొని కళ్ళు మూసుకొని ధ్యానమగ్నులైనారు. జీర్ణమైన బట్టలతో అస్థిపంజరంలా ఉన్న ఆకారంతో ఆయన కనిపిస్తున్నాడు.

అందరూ ఆసీనులైన తర్వాత మూడవకొడుకు – "ప్రభూ వీరు ఎంతగానో నేను ప్రార్థింపగా ఇక్కడకు విచ్చేశారు. వీరు మహాతపస్వులు. వారానికి ఒక్కసారి మాత్రమే క్షీరపానం చేస్తారు. ఘోరమైన తపస్సు చేస్తూంటారు. సదా భగవంతుని ధ్యానంలో ఉండే వీరికి మించిన మహాధర్మాత్ములు లభించడం దుర్లభమే" అన్నాడు. రాజు ఆ మహాత్మునికి సాష్టాంగప్రమాణం చేసి, వారి ఆశీస్సులు అందుకొని వీడ్కోలు పలికాడు. ఆపై వీరు ధర్మాత్ములే అన్నాడు.



అందరి తర్వాత చిన్నకొడుకు వచ్చాడు. అతనితో మాసినబట్టలు కట్టుకున్న పల్లెలో నివసించే ఓరైతు ఉన్నాడు. దూరం నుండే రాజుకు దండాలు పెడుతూ భయపడుతూ ఆరైతు వచ్చి నిలబడ్డాడు. అన్నలు ముగ్గురూ తమ్ముని మూర్ఖత్వానికి పకపకా నవ్వారు. అప్పుడా చిన్నవాడందుకొని "ప్రభూ ఓ కుక్కకు గాయం అయినది. ఇతడది చూసి దాని గాయం కడిగి, మందువేశాడు. అంత నేనితణ్ణి తీసుకునివచ్చాను. ఇతడు ధర్మాత్ముడు అవునో కాదో మీరే అడిగి తెలుసుకోండి" అన్నాడు.

రాజు అడిగాడు., "ఏమయ్యా! నువ్వు ఏధర్మం చేస్తుంటావు?" భయపడుతూనే రైతు పలికాడు "ప్రభూ! నేను చదువుకున్న వాణ్ణికాను. నాకు ధర్మం అంటే ఏం తెలుస్తుంది? ఎవరైనా జబ్బుపడితే సేవ చేస్తాను. ఎవరైనా యాచిస్తే గుప్పెడు మెతుకులు పెడతాను.

అంతరాజు "ఇతడే అందరికన్న గొప్ప ధర్మాత్ముడు" అనగా విని కొడుకులందరూ అటూ ఇటూ చూడసాగారు. రాజు ఇలా అన్నాడు–" దానధర్మాలు చేయడం, గోపూజ చేయడం, అసత్యమాడకపోవడం, క్రోధంగా ఉండక పోవడం, తీర్థయాత్రలు, త్రికాల పూజలు చేయడం, తపస్సు చేయడం కూడా ధర్మమే కానీ అన్నింటికంటే గొప్పదైన ధర్మం ఏమిటంటే అర్థించకపోయినా అసహాయస్థితిలో చేయూతనివ్వడం మొదలగునవి.

పరులకు సహకరించే వానికి తనంతతానుగా సహాయం అందుతుంది. త్రిలోకనాథుడైన పరమాత్మ అట్టి పరోపకార పరాయణునిపట్ల ప్రసన్నుడై ఉంటాడు. కనుక ఈ రైతే గొప్ప ధర్మాత్ముడని నిశ్చయంగా తేల్చి చెప్పి, ఆయనను తెచ్చిన చిన్న కుమారునికి రాజ్యాధికారమును ఇచ్చెను.

కథా నీతి : పరోపకారమును మించిన గొప్ప ధర్మం లేదు.

## అభ్యాసం



### I. అర్థాలు :

| | | | | | |
|---|---|---|---|---|---|
| సర్వాధికుడు | = | అందరికంటే గొప్పవాడు | జలపానం | = | నీరు త్రాగుట |
| దిశ | = | దిక్కు | నియమ బద్ధం | = | నియమాలను పాటించేది |
| సర్వదా | = | ఎల్లప్పుడు | సర్వ శ్రేష్ఠులు | = | అందరికంటే గొప్పవారు |
| తీర్థము | = | జలము | జీర్ణమైన | = | శిథిలమైన (పాడైపోయిన/చీకిపోయిన) |
| క్షేత్రము | = | ప్రదేశము | దుర్లభము | = | లభించుటకు కష్టమైనది |
| సత్కరించుట | = | గౌరవించుట | అర్థించడం | = | యాచించడం |
| సదా | = | ఎల్లప్పుడూ | పరులు | = | ఇతరులు |

చాంద్రాయణ వ్రతం = చంద్రుని యొక్క కళలను అనుసరించి ఆహారమును స్వీకరిస్తూ చేసే వ్రతము

### II. క్రింది ఖాళీలను పూరించండి.

1. నలుగురూ గుఱ్ఱాలెక్కి ................................................... బయలుదేరారు.
2. ఈ బ్రాహ్మణోత్తముడు అన్ని ................................................... కాలినడకన చేశాడు.
3. ఏమయ్యా! నువ్వు ఏ ................................................... చేస్తుంటావు ?
4. రాజు ................................................... ను గొప్ప ధర్మాత్ముడని నిశ్చయించెను.
5. పరోపకారమును మించిన ................................................... లేదు.

### III. ఈ క్రింది ప్రశ్నలకు ఒక్క వాక్యంలో జవాబులు వ్రాయండి.

1. రాజుకు ఎంతమంది కుమారులు కలరు ?
2. రాజు ఎటువంటి వ్యక్తిని తీసుకొనివస్తే రాజ్యాధికారం ఇస్తానన్నాడు ?
3. ఎవరు వేలాది రూపాయలు దానం చేస్తూంటారు ?
4. రాజు ఎవరిని గొప్పధర్మాత్ముడిగా నిశ్చయించాడు ?
5. దేనిని మించిన ధర్మం లేదు ?

IV. సరైన సమాధానం గల అక్షరాన్ని బ్రాకెట్టులో వ్రాయండి.

1. రాజు పెద్దకొడుకు ఎవరిని గొప్పధర్మాత్ముడని అనెను ? ( )

(క) సాధువుని (గ) వ్యాపారిని (చ) బ్రాహ్మణుని (జ) రైతుని

2. త్రికాలాల్లోనూ సంధ్యావందనం చేసేది ఎవరు ? ( )

(క) వ్యాపారి (గ) రైతు (చ) సాధువు (జ) బ్రాహ్మణుడు

3. వారానికి ఒక్కసారే క్షీరపానం చేసేది ఎవరు ? ( )

(క) సాధువు (గ) వ్యాపారి (చ) రైతు (జ) బ్రాహ్మణుడు

4. అందరికంటే గొప్ప ధర్మాత్ముడెవరు ? ( )

(క) వ్యాపారి (గ) బ్రాహ్మణుడు (చ) సాధువు (జ) రైతు

5. అన్నింటికంటే గొప్ప ధర్మం ఏమిటి ? ( )

(క) పరోపకారం చేయడం (గ) సంధ్యావందనం చేయడం (చ) క్షీరపానం చేయడం (జ) తీర్థయాత్రలు చేయడం

V. క్రింది పదాలతో సొంతవాక్యాలు వ్రాయండి.

1. సర్వశ్రేష్ఠము : ..............................................................................

..............................................................................

2. ధ్యానమగ్నులవడం : ..............................................................................

..............................................................................

3. అర్థించడం : ..............................................................................

..............................................................................

4. చేయూతనివ్వడం : ..............................................................................

..............................................................................

5. దుర్లభము : ..............................................................................

..............................................................................

VI. ఇతర వచనాలు వ్రాయండి.

ఉదా : రైతు – రైతులు

1. రాజు – .................................... 2. కాలం – ....................................

3. గుఱ్ఱము – .................................... 4. కుమారుడు – ....................................

VII. వ్యతిరేకపదాలు వ్రాయండి.

1. సహాయం × ..................................  2. సత్యం × ..................................
3. పెద్ద × ..................................  4. ధర్మం × ..................................

VIII. క్రింది పదాలకు పర్యాయపదాలు వ్రాయండి.

1. రాజు = ..................................................... .....................................................
2. కుమారుడు = ..................................................... .....................................................
3. బ్రాహ్మణుడు = ..................................................... .....................................................
4. జలము = ..................................................... .....................................................

IX. క్రింది ప్రశ్నలకు జవాబులు వ్రాయండి.

1. రాజు తన నలుగురు కుమారులతో ఏమన్నాడు ?
2. వ్యాపారిని గురించి పెద్దకొడుకు రాజుతో ఏమన్నాడు ?
3. రైతు గురించి చిన్నకొడుకు రాజుతో ఏమన్నాడు ?
4. రాజు ఎవరిని గొప్పధర్మాత్ముడిగా నిశ్చయించెను ? ఎందువలన ?

## వ్యాకరణము

సమాపక క్రియ : వాక్యములోని క్రియా పదము, ఆ వాక్యానికి పూర్తి అర్థము ఇచ్చినట్లైతే, అలాంటి పదాలను సమాపక క్రియాపదాలు అంటారు. ఉదా : తిన్నాడు, వెళ్ళాడు, నవ్వారు, కోసుకున్నారు.

క్రింది వాక్యాలలోని సమాపక క్రియాపదాలను గుర్తించండి.

1. అతడు పుస్తకాన్ని పూర్తిగా చదివాడు.
2. లత లావణ్యను కొట్టింది.
3. సోము వేణువును ఊదాడు.
4. వెంకన్న పొలము వెళ్ళాడు.
5. సీత గీత దాటింది.